క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : హాలియాలోని 33కేవీ లైన్ మెయింటెనెన్స్ వర్క్ ఉన్నందున గురువారం 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఉంటుందని ఏఈ ధనరాజ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ సబ్ స్టేషన్ నుంచి వచ్చే హాలియా 33 కేవీ మెయింటెనెన్స్ వర్క్ ఉన్న కారణంగా ఆ ఫీడర్ పరిధిలో హాలియా, అనుముల, అనుములవారిగూడెం, ఈశ్వర్‌నగర్, కొత్తపల్లి, నాయుడుపాలెం, ఇబ్రహీంపేట ప్రాంతాలకు ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని గృహ, వాణిజ్య, వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు జూనియర్ లెక్చరర్ పోస్టులకు తాత్కాలిక పద్ధతిలో మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఎంఏ బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ నెల 15 లోపు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

సీజ్ చేసిన వాహనాలకు నేడు వేలం

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఐదు కేసుల్లో సీజ్ చేసిన 8 ద్విచక్రవాహనాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఉదయం 11గంటలకు ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.మరిన్ని వివరాల కోసం క్యాంపులోని కార్యాలయాలను సంప్రదించాలన్నారు.

మెనూ చార్ట్ అమలు చేయాలి

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తప్పనిసరిగా మెనూ ప్రకారం వడ్డించాలని అనుముల మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి మధ్యాహ్న భోజన కార్మికులను కోరారు. బుధవారం హాలియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ హెచ్‌ఎంలకు, కుక్ కమ్ హెల్పర్లరకు భోజన నిర్వహణపై నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ప్రకాష్, దాస వెంకన్న, ఆర్‌పీలు ప్రసాద్, మణి ఉన్నారు.


బాధిత కుటుంబానికి పరామర్శ

హాలియా : మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుర్రం నర్సిరెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఆప్కాబ్ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యడవెల్లి విజేందర్‌రెడ్డి తిమ్మాపురం గ్రామంలో బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవెల్లి విజేందర్‌రెడ్డి మృతి చెందిన రామచంద్రారెడ్డి మృతదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఉద్యమకారులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

నాగార్జున సాగర్ : తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఇచ్చిన పిలుపు మేరకు నందికొండ మున్సిపాలిటీ పరిదిలోని ఉద్యమకారులు హామీలు త్వరలో నెరవేరాలని బుధవారం తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర సరిహద్దులోని కృష్ణానదీతీరంలో కృష్ణమ్మకు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా కార్యదర్శి కాయతి జానకిరెడ్డి, నందికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ హీరేకార్ రమేశ్‌జీ, సల్లోజు శంకరాచారి పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఏపీఎం చంద్రశేఖర్

మాడుగులపల్లి : మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుట్టించిన స్కూల్ యూనిఫాంలను బుధవారం మండలంలోని పాములపాడు జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు ఏపీఎం భాషపాక చంద్రశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కొలతలు తీసుకొని యూనిఫాంలు కుట్టించినట్లు తెలిపారు. తద్వారా మహిళలకు జీవనోపాధి కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ పుట్టల నాగయ్య, హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ దుర్గం లక్ష్మి, మణెమ్మ, వీవోఏ యాదమ్మ, పావని, ఉషా పాల్గొన్నారు.

గుంతలు పడి.. కంకర తేలి

- అధ్వానంగా పాములపాడు–భీమవరం రోడ్డు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



గుంతలమయంగా ఉన్న పాములపాడు- భీమవరం రోడ్డు

మాడుగులపల్లి : గ్రామీణరహదారులు ఇప్పుడు ప్రమాద బాటలుగా మారాయి. రహదారి మొత్తం గుంతలమయమై, కంకరతేలి కనిపిస్తుండడంతో నిత్యం ఆ రహదారుల గుండా వెళ్లే ప్రయాణికులకు నరకప్రాయంగా మారుతున్నాయి. అధ్వానంగా ఉన్న రహదారుల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే మాడుగులపల్లి మండలం పాములపాడు గ్రామం నుంచి కేతేపల్లి మండలం భీమవరం వరకు నాలుగు కిలోమీటర్ల రోడ్డు గుంతలమయంగా కంకరతేలి ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారి గుండా ప్రయాణించాలంటే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఈ రోడ్డు వేసిన కొద్ది రోజులకే గుంతలు ఏర్పడడంతో ఈ రహదారిని పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో రహదారికి ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో ప్రయాణం సాగించలేని పరిస్థితి నెలకొంది. ఆటోలు సైతం ఈ రహదారి గుండా వెళ్లలేకపోతుండడంతో గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదే ప్రధాన రహదారి

మాడుగులపల్లి మండలం పాములపాడు, భీమవరం నాలుగు కిలోమీటర్ల పరిధిలోని ఈ రోడ్డు సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు అనుసంధానంగా ఉండడంతో వాహనదారులు సూర్యాపేట నుంచి నల్లగొండకు పనుల నిమిత్తం ఈ రోడ్డు గుండానే ప్రయాణం చేయాల్సి ఉంటుది. మాడుగులపల్లి మండలంలోని కుక్కడం, తోపుచర్ల, మాడుగులపల్లి, ఆగామోత్కూర్, ఇందుగుల, కల్వలపాలెం, భీమనపల్లి, చర్లగూడెం, పోరెడ్డిగూడెం, చిరుమర్తి గ్రామాలతోపాటు తిప్పర్తి మండలంలోని సర్వారం, ఎల్లమ్మగూడెం, గోదారిగూడెం గ్రామాల ప్రజలు సూర్యాపేటలోని వివిధ కంపెనీల్లో పనుల కోసం నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. ఈ రోడ్డు అధ్వానంగా గా ఉండడంతో చేసేదేమి లేక పాములపాడు, కేతేపల్లి మండలం తుంగతుర్తి, ఉప్పలపాడు, కొప్పోలు, సూర్యాపేట జిల్లాలోని టేకుమట్ల, రాయినిగూడెం 65వ జాతీయ రహదారిపై ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దూరభారం పెరిగిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అధ్వానంగా ఉన్న రోడ్డుపై ఆయా శాఖల్లో పనిచేసే ఉద్యోగులు వేములపల్లి మండలం ఆమనగల్లు, లక్ష్మీదేవిగూడెం గ్రామాల నుంచి తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. మాడుగులపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు సూర్యాపేటలోని కళాశాలల్లో విద్యనభ్యసించేందుకు ఈ రోడ్డు గుండానే ప్రయాణం చేయాల్సి వస్తుంది. బస్సు సౌకర్యం లేకపోవడం, అధ్వానంగా ఉన్న ఈ రోడ్డుపై నుంచి ఆటోలు వెళ్లలేక విద్యార్థులు భీమవరం వరకు వెళ్లి నడుచుకుంటూ గాని వాహనదారులను లిఫ్ట్ అడిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు గుంతలమయంగా ప్రమాదకరంగా ఉండడంతో ఎక్కువ మంది ప్రజలు సూర్యాపేట, రాయినిగూడెం, టేకుమట్ల, కేతేపల్లి, నకిరేకల్, కట్టంగూర్ నుంచి ప్రయాణించాల్సి వస్తుంది. ఇప్పటికైనా మరమ్మతులు చేయించాలని పలు గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

చుట్టూ తిరిగి వెళ్తున్నాం



మండలంలోని పాములపాడు- భీమవరం రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో ప్రయాణించలేకపోతున్నాం. ఆయా పనుల నిమిత్తం వెళ్లాలంటే చేసేదేమి లేక చుట్టు తిరిగి వెళ్తున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించి సమస్యలను పరిష్కరించాలి.

– తీగల రాంబాబు, పాములపాడు

టెండర్ దశలో ఉంది



మాడుగులపల్లి మండలం పాములపాడు – భీమవరం రోడ్డు నిర్మాణ పనులు టెండర్ దశలో ఉంది. ఈ రోడ్డుకు ప్రభుత్వం ఎంఆర్ఆర్‌లో భాగంగా రూ.1.60కోట్లను మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులను ప్రారంభిస్తాం.

– మధు, పీఆర్ ఏఈ

సంక్షేమం, అభివృద్ధి.. ప్రభుత్వానికి రెండు కళ్లు

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : సంక్షేమం, అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని ఆయన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే మొదటి విడుతలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాలు అందజేసినట్లు ఆయన గుర్తు చేశారు. రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు.అంతేకాకుండా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం కింద నియోజకవర్గ వ్యాప్తంగా 93మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన ప్రతి రైతుకు సోలార్ పంపుసెట్టు ఇవ్వడం ద్వారా విద్యుత్ అవసరం లేకుండా స్వయంగా ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ డీఈ నాగేందర్, డీటీటీఓ ఛత్రునాయక్, ఆయా మండలాల ఎంపీడీఓలు, తదితరులున్నారు.

వార్డుల విభజన శాస్త్రీయంగా చేపట్టాలి



మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హాలియా : మున్సిపాలిటీలో వార్డుల విభజన ప్రక్రియను శాస్త్రీయంగా చేపట్టాలని కోరుతూ బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ హాలియా మున్సిపాలిటీలో ఉన్న 1వ, 2వ వార్డులోని 600 ఓటర్లను తీసి వేసి ఇబ్రహీంపేటను ప్రత్యేక గ్రామ పంచాయతీగా చేశారన్నారు. ప్రసుత్తం 10వార్డులున్న మున్సిపాలిటీలో 12వార్డులకు విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన క్రమంలో అధికారులు గందరగోళానికి తెరతీశారని పేర్కొన్నారు. గతంలో కొత్తగా హాలియా మున్సిపాలిటీ ఏర్పాటు జరిగినప్పుడు మొదట ఈశాన్యం నుంచి వార్డుల విభజన తీసుకొని వార్డుల పునర్విభజన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వడ్డె సతీష్‌రెడ్డి, దోరేపల్లి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యడవెల్లి మహేందర్‌రెడ్డి, చాపల సైదులు, సురభి రాంబాబు, ఆంజనేయులు, జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి

గుర్రంపోడు : మహిళలు స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వై.శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో కొత్తగా ఎంపికైన సంఘబంధం కమిటీ శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి సంఘబంధంలో కొత్తగా కమిటీ సభ్యులను ఎన్నుకుని వారికి మండల స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ సంఘం సమావేశం నిర్ణయించిన తేదీ ప్రకారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించాలన్నారు. సంఘబంధం సమావేశంలో మహిళలు అన్ని విషయాలు చర్చించి తీర్మానం చేయాలన్నారు. ప్రతి ఇంటికి తప్పనిసరిగా మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని, ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి సమావేశానికి గ్రామ స్థాయిలో లైవ్ డిపార్ట్‌మెంట్ నుంచి అధికారులను పిలిచి వారి డిపార్ట్‌మెంట్ విధులను తెలుసుకోవాలన్నారు. ప్రతి మహిళకు బీమా చేయడం జరుగుతుందని, ప్రమాద బీమా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మంజుల, డీపీఎం బ్యాంక్ లింకేజీ అధికారి రామలింగయ్య, ఏపీఎం వి. యాదయ్య , సీసీ రాజేశ్వరిలు పాల్గొన్నారు.

కస్తూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



గుర్రంపోడు : కొప్పోలులో విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేస్తున్న శ్రీ చరణ్

గుర్రంపోడు : పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీ చరణ్ అందిస్తున్న సేవలు సేవలు అభినందనీయమని మండల విద్యాధికారి నోముల యాదగిరి అన్నారు. బుధవారం మండలంలోని కొప్పోలు గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆటవస్తువులు, కుర్చీలు, వంట పాత్రలు, గ్రంథాలయానికి కుర్చీలు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీ చరణ అంజేశారు. ఈ సందర్భంగా శ్రీచరణ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తూ తన స్వగ్రామమైన కొప్పోలులో ప్రభుత్వ పాఠశాలలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సంకల్పించినట్లు తెలిపారు. తన జన్మదినం రోజున విద్యార్థులతో కలిసి ఉండటం తనకు ఎంతో సంతోషాన్ని కల్గిస్తుందన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామ యువత సమన్వయంతో పనిచేసి తమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ఈ సమావేశంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సునీత, రిటైర్డు హెచ్‌ఎం కె. వెంకట్‌రెడ్డి , స్థానిక నాయకులు, గ్రామ యువత పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి




విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ : విద్యార్థులు చదవుపై శ్రద్ధ వహించాలని చదువుతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు అన్నారు. బుధవారం పట్టణంలోని అశోక్‌నగర్ లోటస్ స్కూల్‌లో 40రోజులు విద్యార్థులకు వివిధ అంశాలపై ఆల్ మదీనా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అఖిల్ ఉమర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిబిరం ముగింపు సందర్భంగా సర్టిఫికెట్లు, /జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు ప్రకటించగానే కొంతమంది జల్సాలకు, ప్రయాణాలకు సమయం కేటాయించకుండా శిబిరంలో నెల రోజులు గణితం, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, చేతిరాత, సీ+++, జావా, పైథాన్ అంశాలపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ వరప్రసాద్, ఎజాజ్ హష్మీ, హఫీజ్, జర్నలిస్టులు ఖాజా హమీదొద్దీన్, ఎండీ అస్లాం, ఎండీ రఫీయొద్దిన్, టీచర్లు ఫౌజియా, లూసిడా పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

మిర్యాలగూడ : వ్యవసాయాధికారులు నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను, పురుగుమందులను అందించాలని దామరచర్ల సీపీఎం మండల నాయకులు కోరారు. బుధవారం డీటీకి, వ్యవసాయాధికారులకు వినతిపత్రం అందించి వారు మాట్లాడారు. నకిలీ విత్తనాలు, ఎరువులు వల్ల సరైన దిగుబడులు రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతన్నారన్నారు. నకిలీ విత్తనాలను అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోని రైతాంగానికి నాణ్యమైన విత్తనాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో, ప్రజాసంఘాలతో కలిసి ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాపానాయక్, దయానంద్, బాలు తదితరులు ఉన్నారు.

మిల్లులో మొలకెత్తిన ధాన్యం బస్తాలు



మిల్లులో పక్కకు పడేయడంతో మొలకెత్తిన ధాన్యం బస్తాలు

మాడుగులపల్లి : ఐకేపీ ధాన్యంలో తాలు, మొలకలు పేరుతో మిల్లు యాజమాన్యం ధాన్యం బస్తాలను మిల్లులో పక్కకు వేశారు. వివరాల్లోకి వెళ్తే తిప్పర్తి మండలం పజ్జూరులోని ఐకేపీ కేంద్రం నుంచి మూడు ధాన్యం లారీలను మే 28న మాడుగులపల్లి మండలంలోని కొత్తగూడెం గ్రామ శివారులోని శ్రీనివాస్ రైస్ ఇండస్ట్రీస్‌కు తీసుకొచ్చారు. అయితే మిల్లు యాజమాన్యం ఆ మూడు లారీల్లో తాలు, మొలకలు ఉన్నాయని చెప్పి ఆ మూడు లారీలకుగాను రెండు లారీల్లోని 9బస్తాలను పక్కకు పెట్టి ఈనెల 2న దిగుమతి చేసుకోగా 3వ లారీలో తాలు, మొలకలు ఎక్కువగా ఉన్నాయని తాము దిగుమతి చేసుకోమని తీసుకెళ్లాలని ఐకేపీ నిర్వాహకుడికి తెలిపారు. మూడో లారీని సైతం దిగుమతి చేసుకోవాలని మిల్లు యాజమాన్యంను కోరగా ఆ లారీలో మొలకలు వచ్చిన 5బస్తాలను తొలగించి మిల్లులోనే పక్కకు వేసి మిగతా ధాన్యం బస్తాలను ఈనెల 9న దిగుమతి చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఐకేపీ నిర్వాహకుడు 14 బస్తాల ధాన్యాన్ని ఎందుకు దిగుమతి చేసుకోలేదని అడగగా తాము ప్రభుత్వ నిబంధనల ప్రకారమే దిగుమతి చేసుకుంటామని చెప్పి వాటిని తీసుకెళ్లాలని ఐకేపీ నిర్వాహకుడికి సూచించగా మూడు రోజులవుతున్నా ఐకేపీ నిర్వాహకుడు వాటిని తీసుకెళ్లకపోవడంతో ఆ బస్తాలను మిల్లు యాజమాన్యం మిల్లు గోదాంలోనే ఉంచింది.

ప్రీ స్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలి



మాడుగులపల్లి : ఆగామోత్కూర్‌లో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సూపర్‌వైజర్



పెద్దవూర : చలకుర్తిలో చిన్నారులకు పూలు అందజేసి స్వాగతం పలుకుతున్న సూపర్‌వైజర్

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీ స్కూల్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ రేఖల మమత అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్ సెక్టర్ పరిధిలోని పాపాసు లదిబ్బ అంగన్‌వాడీ కేంద్రం-3లో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఎగ్ బిర్యాణి రైస్ వండి వడ్డించారు. అలాగే ముత్తిరెడ్డి కుంట అంగన్‌వాడీ కేంద్రం -3లో బుధవారం అమ్మమాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చనగాని యాదగిరి, కాంగ్రెస్ నాయకులు బెజ్జం నాగార్జులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో గాంధీనగర్ సెక్టార్ సూపర్‌వైజర్ నజిమాబేగం, బ్లాక్ కో ఆర్డినేటర్ కవి, అంగన్‌వాడీ టీచర్లు పిల్లల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు తతదితరులున్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

పెద్దవూర: ఐదేళ్లలోపు పిల్లలను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌసియాబేగం అన్నారు. బుధవారం మండలంలోని చలకుర్తి గ్రామంలో అమ్మ మాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి చిన్నారులను పూలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శాంతమ్మ, యాదమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవుపల్లి : మండలం ఉల్సాయిపాలెం గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగరాణి ప్రారంభించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి కేంద్రంలో చిన్నారులకు ఎగ్ బిర్యానిని వడ్డించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచరు శిరీషతో పాటు సిబ్బంది తదితరులున్నారు.

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని వైజాక్ కాలనీలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్లు శోభ, టీచర్లు సువార్త, అరుణ, సరిత, భాగ్యమ్మ, నీలా, ప్రమీల, పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల అంగన్‌వాడీ సెక్టార్‌లో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఖతిజా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ సరళ, అంగన్‌వాడీ టీచర్లు శోభ, జ్యోతి, అంగన్‌వాడీ ఆయా పద్మ, బాలింతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిడమనూరు : చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని సీడీపీఓ ఉదయ శ్రీ పిలుపునిచ్చారు. నిడమనూరులో చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సైదాబేగం, ఏసీడీపీఓ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరీ, అలివేలు, సునీత పాల్గొన్నారు.

మాడుగులపల్లి : మండలంలోని ఆగామోత్కూర్‌లో అమ్మ మాట – అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని బుధవారం సూపర్‌వైజర్ నాగమణి ప్రారంభించి మాట్లాడారు. 3నుంచి 5ఏళ్లలోపు పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఎగ్ బిర్యాని కార్యక్రమం ప్రారంభించి చిన్నారులకు, తల్లులకు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, ఏఎన్‌ఎం వనజాత, ఆశాలు కోటమ్మ, సావిత్రి, అంగన్‌వాడి టీచర్లు తల్లులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

పెద్దవూర : అనారోగ్యంతో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న మండల కేంద్రానికి చెందిన ఊరె సాయిబాబకు బుధవారం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సాయిబాబను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పులిమాల కృష్ణారావు, మాజీ వైస్ ఎంపీపీలు యడవెల్లి దిలీప్‌రెడ్డి, రాంరెడ్డి, రమేష్, రావుల సాయి, మహేష్, శ్రీను, పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన బూడిగపాక దివ్య అత్తింటి వేదింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న పట్ట ణానికి చెందిన వ్యాపారవేత్త భద్రి రామారావు ఆ కుటుంబాని పరామర్శించారు. అనంతరం లాస్య(2), తరుణ్‌కుమార్(4నెలలు) తల్లి కోసం రోదిస్తున్న తీరును చూసి ఆ ఇద్దరి పిల్లలకు తన వంతు సాయంగా రూ.50వేలను అందించి తన మానవత్వాన్ని చాటుకున్నాడు.

ఎరువుల దుకాణం తనిఖీ

కొండమల్లేపల్లి : మండల వ్యవసాయ అధికారి వై.జానకిరాములు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్‌కె.గౌస్ ఆధ్వర్యంలో సంయుక్తంగా బుధవారం కొండమల్లేపల్లిలో ఎరువుల దుకాణాలను తనిఖీ నిర్వహించారు. డీలర్లు విత్తనాలను ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయించరాదని సూచించారు. విత్తనాలను ఈ-పాస్ యంత్రాల ద్వారా మాత్రమే విక్రయాలు జరపాలని సూచించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఏఈఈ సుభాష్, హెడ్‌కానిస్టేబుల్ నరసింహారెడ్డి, హమీద్, ఏఈవోలు సురేష్, మల్లేష్, డీలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య లభిస్తుందని హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని రంగుండ్ల, తిరుమలగిరి, అల్వాల ఎక్స్ రోడ్డు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమలంలో అధ్యాపకులు సంజీవరెడ్డి, ఆదిరెడ్డి, లింగమూర్తి, వెంకటేశ్వర్ నాయక్, బాలరాజు, బాలరాజు, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి చట్టంతో సమస్యలు పరిష్కారం



మిర్యాలగూడ : సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



వేములపల్లి : దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

వేములపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని మొల్కపట్నం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొల్కపట్నంలో 61 దరఖాస్తులు రాగా మండలంలో మొత్తం 483 దరఖాస్తలు వచ్చాయన్నారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు హర్ష, గణేష్ ఉన్నారు.

భూ భారతి చట్టంతో భూములకు భద్రత


మిర్యాలగూడ : భూభారతి చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం దామరచర్ల మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బెజ్జం సాయి, మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రైతులకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తులను స్వీకరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ఆయన తనిఖీ చేసి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సురేష్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

చందంపేట : భూ భారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వి నియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీధర్‌బాబు కోరారు. బుధవారం చందంపేట మండలంలోని కంబాలపల్లిలో, నేరెడుగొమ్ము మండంలోని కాచరాజుపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

పెద్దవూర : భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని పులిచర్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, అబీబ్, పాల్గొన్నారు.

పెంచిన బస్‌పాస్ ఛార్జీలు తగ్గించాలని వినతి



దేవరకొండ : డీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన విద్యార్థుల బస్‌పాస్‌ల ఛార్జీలు వెంటనే తగ్గించాలని ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం దేవరకొండ డిపో మేనేజర్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం డివిజన్ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పది లక్షలకు పైగా పేద,మధ్య తరగతి విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల నుండి చదువుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో కిరణ్, అఫ్రోజ్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం బస్‌పాసు చార్జీలను పెంచడంపై విద్యార్థులపై అదనపు భారం పడుతుందని, వెంటనే ఆ చార్జీలను తగ్గించాలని కోరుతూ బుధవారం వన్ టౌన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు బంటు గిరి, కొంగరి వెంకటరమణ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మకు వినతిపత్రం అందజేశారు. పెంచిన బస్సు పాసు చార్జీలను తక్షణమే తగ్గించాలని అధికారులను కోరారు.